రేపు మండల సమావేశం

శంషాబాద్ రూరల్: ఈ నెల 8న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని మండల స్థాయి అధికారులు, పంచాయతీ ప్రత్యేకాధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు మూగ జీవాల దత్తత

మణికొండ: మూగజీవాల దత్తత తీసుకునే కార్యక్రమాన్ని ఈ నెల 7న (నేడు) నిర్వహించనున్నామని జంతు ప్రేమికుడు నవీన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అలకాపూర్ టౌన్‌షిప్‌లోని నేతాజీ పార్కులో వాటిని ఉచితంగా దత్తత తీసుకునే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ సభకు తరలిన శ్రేణులు



నార్సింగి నుంచి అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో సభకు వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

మణికొండ: తుక్కుగూడ కేంద్రంగా శనివారం జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభకు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వీరికోసం మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు, వాహనాలు ఏర్పాటు చేశారు.

రాజేంద్రనగర్ డివిజన్ నుంచి..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్, సీనియర్ నాయకుడు కోరని శ్యామ్ ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివెళ్లారు. దారి పొడవునా పార్టీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు.

త్వరలో నైపుణ్య శిక్షణ తరగతులు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం ప్రాంగణంలోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌లో యువతకు ఉపాధి కల్పన నైపుణ్య శిక్షణ తరగతులు త్వరలో ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల యువతులకు ఉచితంగా వసతి, భోజనం అందిస్తూ వివిధ కోర్సులను అందిస్తామని పేర్కొన్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్, ఎక్సావేటర్, ఫ్యాబ్రికేషన్, ఫాల్స్ సీలింగ్, డ్రైవాల్స్, రిటైల్ సేల్స్ అసోసియేషన్ సంబంధిత కోర్సులు ఉన్నాయని, ఆసక్తి గల వారు ఈ నెల 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8985800102 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఎంసీ కౌన్సిల్ హాల్‌లో డీఈఈ, ఏఈఈ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, వాటర్‌మెన్‌లతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఇబ్బందిలేకుండా చూడాలన్నారు. లైన్‌మెన్లు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రజలు నీటిని వృథా చేయకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌సాగర్ హెచ్‌పీ పెట్రోల్ పంపు ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటుందని వారు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఎవరైనా సంబంధికులు ఉంటే రాజేంద్రనగర్ పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.

సంస్కృతి, సంప్రదాయాలు అలవర్చుకోవాలి



బండ్లగూడ: ప్రతి విద్యార్థి సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ గౌరీ సతీశ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో శనివారం సంస్కృతిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అంతరించిపోతున్న సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ బల్ల కిరణ్‌కుమార్, అధ్యాపకులు శ్రీలత, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొట్టిన డీసీఎం

రాజేంద్రనగర్: డీసీఎం వ్యాన్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారు నుంచి డీసీఎం వ్యాన్‌లో టమాటలను నగరంలోని కూరగాయల మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఉదయం 5 గంటల ప్రాంతంలో పీవీ నరసింహా రావు ఎక్స్‌ప్రెస్ వే 237 వద్దకు రాగానే వ్యాన్ అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎంలోని టమాటలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాన్ని తొలగించారు. ఎవరికి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

సొంత ఖర్చులతో పార్కు పనులు

- మధుబన్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల చొరవ
- పొక్లెయిన్‌తో స్థలాన్ని చదును చేయిస్తున్న వైనం



పార్కు స్థలంలో పొక్లెయిన్‌తో బండరాళ్లను తొలగిస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: ఏళ్ల తరబడి గుట్టలతో ఉన్న స్థలంలో పార్కు ఏర్పాటుకు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీకారం చుట్టారు. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. వాకింగ్ చేసేందుకు పార్కు లేకపోవడంతో సొంత నిధులు వెచ్చించి పార్కు స్థలాన్ని చదును చేయిస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్‌కాలనీలో హెచ్‌ఎండీఏ వారు సుమారు 800 ఇళ్లను నిర్మించారు. అప్పుడు గుట్టలతో ఉన్న స్థలాన్ని పార్కుకు కేటాయిస్తూ లేఅవుట్‌లో చూపించారు. అయితే 40 ఏళ్లు గడుస్తున్నా.. కాలనీలో మాత్రం పార్కు ఏర్పాటు చేయలేదు. ఈ విషయమై అధికారులు, రాజకీయ నాయకులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో మధుబన్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ అధ్యక్షుడు డీవీ కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అసోసియేషన్ సమావేశం నిర్వహించి నిధులు సేకరించారు. కాలనీలో గుట్టలతో ఉన్న 3000 గజాల స్థలాన్ని 4 రోజులుగా ఎక్స్‌కవేటర్‌తో తొలగించి చదును చేయిస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ. 3 లక్షల వరకు ఖర్చవుతున్నట్లు అధ్యక్షుడు తెలిపారు. పార్కు స్థలాన్ని చదును చేసి అందులో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. కాలనీ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్,చింటు, నాని పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రజాప్రతినిధులు చేయలేని పనులను వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పార్కు ఏర్పాటులో నిర్లక్ష్యం..



కాలనీలో సుమారు 5 వేల మంది వరకు నివసిస్తున్నారు. అయితే కాలనీలో వాకింగ్, సేద తీరేందుకు స్థలం ఉన్న పార్కు ఏర్పాటు చేయలేదు. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతి నిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 3 లక్షలతో పార్కు స్థలాన్ని చదును చేయిస్తున్నాం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి చదును చేసిన స్థలంలో పార్కును ఏర్పాటు చేయాలి.

–డీవీ కుమార్, మధుబన్ కాలనీ అధ్యక్షుడు

'కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం'



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ని భారీమెజార్టీతో గెలిపించుకుందామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని తన నివాసంలో సర్కిల్ కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఈ నెల 13వ తేదీన చేవెళ్లలో కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభకు భారీగా జన సమీకరణ చేయాలన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ పాలనలో జరగదని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి బీఆర్‌ఎస్ సత్తా చూపిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వనం శ్రీరామ్‌రెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు టి ప్రేమ్‌గౌడ్ సీనియర్ నాయకులు పడమటి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్సింగిలోని కేవీఎంఆర్ గార్డెన్‌లో..

మణికొండ: నార్సింగిలోని కేవీఎంఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీలకు చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో నిర్వహించే సభకు గండిపేట మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ రేఖాయాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, నార్సింగి, మణికొండ, బండ్లగూడ మున్సిపాలిటీల పార్టీ అధ్యక్షులు ఆర్. నర్సింహ, బి.శ్రీరాములు, ఎ.నరేశ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు సామ ఇంద్రపాల్ రెడ్డి రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న సామ ఇంద్రపాల్ రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సామ ఇంద్రపాల్ రెడ్డి తన అనుచరులతో కలిసి శనివారం పార్టీకి రాజీనామా చేశారు. సంబంధిత పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డికి పంపించారు. ఉప్పర్‌పల్లిలోని తన నివాసంలో అనుచరులతో కలిసి శనివారం సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్ అభివృద్ధిని కాంక్షించి పార్టీలో చేరానని, అప్పటి నుంచి ఇప్పటివరకు పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఎంతో కృషి చేశానన్నారు. 2018, 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ గెలుపు కోసం, అలాగే 2019లో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి విజయానికి కృషి చేసినట్లు తెలిపారు. కానీ గడిచిన కొంతకాలంగా తమపై వ్యతిరేక భావనతో ఉండడంతోనే ఆత్మగౌరవాన్ని చంపుకోలేక బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. త్వరలో అనుచరులు, సానుభూతిపరులు ఉప్పర్‌పల్లి గ్రామ పెద్దలందరితో సమావేశం నిర్వహించి ఏ పార్టీలో చేరాలనేది చర్చించి తన రాజకీయ భవిష్యత్‌ను వెల్లడిస్తానని తెలిపారు. సమావేశంలో కె.దయానంద్ గౌడ్, ఏసు నరసింహ రెడ్డి, మోహన్ రెడ్డి, భూపాల్ రెడ్డి, వెంచర్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వైట్‌హౌస్ సెట్‌తో హ్యాండిక్రాఫ్ట్ మేళా



లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ సంగం వద్ద వైట్ హౌస్‌ను తలపించేలా హ్యాండిక్రాఫ్ట్స్ మేళా రూపుదిద్దుకుంటుంది. చిన్నారులను, పెద్దలను ఆకర్షించేలా నూతన సెట్‌లతో అందమైన ఆకృతులను తయారుచేయడం వీరి ప్రత్యేకత. నిర్వాహకుడు రాబ్సన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఇన్‌ఫాంట్ హ్యాండ్లూమ్ హ్యాండిక్రాఫ్ట్స్ మేళా లక్షల జనాల మన్ననలు పొందింది. పెద్దపెద్ద సినిమాలకు సైతం వీరి మేళా సెట్లను తీసుకుంటారంటే ఎంతగా ఆదరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం లంగర్‌హౌస్ సంగం వద్ద ఈ సెట్ ఏర్పాటు జరుగుతుంది. త్వరలో పండుగ వేళ ఈ మేళాను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు రాబ్సన్ తెలిపారు. ఈ మేళాలో పిల్లలు ఆడుకునేందుకు మరిన్ని కొత్త వస్తువులను ఏర్పాటు చేయడంతో పాటు, మగువలను ఆకట్టుకునే వివిధ వస్తువులను అమ్మకానికి అందుబాటులో ఉంచనున్నామన్నారు.

హెచ్‌సీయూలో 'క్లీనప్ డ్రైవ్'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో శనివారం 'క్లీనప్ డ్రైవ్' కార్యక్రమాన్ని చిల్డ్రన్స్ పార్కులో నిర్వహించారు. హెచ్‌సీయూలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శానిటేషన్ విభాగం, హార్టికల్చర్ విభాగం సహకారంతో ఎన్‌ఎస్ఎస్ వాలంటీర్లు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు. పార్కులో చెత్తాచెదారం, వ్యర్థాలు ప్లాస్టిక్ కవర్లు, ఇతరత్రా వాటిని తొలగించారు. డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ శానిటేషన్, హార్టికల్చర్ విభాగాల అధికారులు సుధాకర్, విష్ణు, యాదగిరి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

మణికొండ: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్మికులు, ప్రజలతో కలిసి శనివారం మున్సిపల్ కార్యాలయం నుంచి గోల్డెన్ టెంపుల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఈ సాయిమౌనిక, పారిశుద్ధ్య ఇన్‌చార్జి సంపత్, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయిస్తున్న నోడల్ అధికారి శరత్‌చంద్ర

సింగిడి పోస్టర్ విడుదల



శంషాబాద్: ఉస్మానియా వర్సిటీలో త్వరలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాల (సింగిడి) పోస్టర్‌ను ఏబీవీపీ నాయకుడు ప్రదీప్ ఆధ్వర్యంలో శనివారం విడుదల చేశారు. పట్టణంలోని ఆయా కళాశాలల వద్ద జరిగిన పోస్టర్ విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

మహిళ హత్య

శంషాబాద్ రూరల్: అదృశ్యమైన మహిళ హత్యకు గురైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాల్మాకులకు చెందిన యాదమ్మ గత నెల 27న రాళ్లగూడలోని కోడలు ఇంటికి వచ్చింది. అక్కడి నుంచి బయలుదేరిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈ క్రమంలో శనివారం ఆమె మృతదేహం సంఘీగూడ శివారులో లభించింది. స్థానికుల సమాచారంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతురాలు యాదమ్మగా గుర్తించారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఇఫ్తార్'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షుడు మహ్మద్ ఖాలేద్, సీనియర్ నాయకుడు జావీద్, మన్సూర్ తెలిపారు. శనివారం రాజేంద్రనగర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పీవీ నరసింహారావు పిల్లర్ నంబర్ 268 ప్రాంతంలోని ఎస్‌ఎన్‌సీ కన్వెన్షన్‌లో సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ చైర్మన్ మహ్మద్ ఫయీమ్ ఖురేషి, రాష్ట్ర డెయిరీ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డితో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న డివిజన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్

మైలార్‌దేవ్‌పల్లి: బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్ యాదవ్ హాజరై కార్యకర్తలతో కలిసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..వికసిత్ భారత్ నిర్మాణాన్ని చేపట్టి అన్ని వర్గాల ప్రజలను ఈ మహా యజ్ఞంలో భాగస్వాములు చేసి దేశ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని అన్నారు. ప్రజలు మూడోసారి కూడా ప్రధానిగా మోదీనే కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి జోగి రవి, డివిజన్ అధ్యక్షుడు అడికె జనార్దన్, రావుల భాస్కర్, బొమ్మరాజు నర్సింహ, నవారు మురళీధర్‌రెడ్డి, బాబు, శశిధర్ రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మి, బబ్లూ, శ్రవణ్‌కుమార్ , శివశంకర్, మహేందర్‌రెడ్డి, ఉత్తం, అరుణ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్ డివిజన్‌లో..

అత్తాపూర్ : రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్‌లోని హైదర్‌గూడ పిల్లర్ నంబర్ 143 వద్ద అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాధ విజయ్ కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ 44వ దినోత్సవాన్ని మోదీతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి కొమురయ్య, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత, సీనియర్ నాయకులు సుధాకర్, రాజశేఖర్, కృష్ణ, రాజు, సిద్దేశ్వర్, విజయ్‌రావు, నరేశ్, బాలకృష్ణ, సరిత, విజయలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

బండ్లగూడలో..

బండ్లగూడ: బండ్లగూడ బస్టాప్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు జి.మనీశ్‌గౌడ్, టి.మనోజ్, బి.సాయికిరణ్, అభిలాష్‌ముదిరాజ్, రాజేంద్రనగర్ కన్వీనర్ మహాలింగంగౌడ్, టి.గోపి, టి.కిశోర్, కె.శ్రీశైలం, బి.దయానంద్, బి.అభినయ్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో 172వ బూత్ అధ్యక్షుడు వేముల జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మూల శ్రీనివాస్ గౌడ్, తొండుపల్లి మల్లేశ్, భాస్కర్ యాదవ్, ఇ.వేణుగోపాల్, కె.శశిధర్, కె.వంశీ, జ్ఞానేశ్వర్, జి.పద్మావతి, వినితా రెడ్డి, స్వప్న రెడ్డి, కవితా తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



బండ్లగూడ బస్టాప్ వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చలివేంద్రాలతో ప్రజలకు మేలు



సంతోష్‌నగర్‌కాలనీలో చలివేంద్రాన్ని ప్రారంభించిన చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: చలివేంద్రాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడ సంతోష్‌నగర్ కాలనీ, మణికొండ మర్రిచెట్టు వద్ద అభినందన ఇన్‌ఫ్రా సంస్థలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో బాటసారులు, ప్రజలకు తాగేందుకు నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటారని, చలివేంద్రాల ఏర్పాటుతో వారికి ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు కె.లక్ష్మీనారాయణ, డి.పురుషోత్తం, బి. శ్వేత రవికాంత్‌రెడ్డి, ఎల్.వందన నగేశ్, కోఆప్షన్ సభ్యులు జె.సిద్ధప్ప, జె. లక్ష్మీరాములు, బీజేపీ అధ్యక్షుడు సి.బీరప్ప, అభినందన సంస్థ చైర్మన్ వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.



మణికొండ మర్రిచెట్టు కూడలిలో..



ఆదర్శ విద్యాలయ హైస్కూల్‌లో వేడుకలు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఆదర్శ విద్యాలయ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే సెర్మనీ కార్యక్రమాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆలపించిన భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ అమరేందర్, కాంగ్రెస్ నాయకుడు నారాయణ ముదిరాజ్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నోవాటెల్ హోటల్‌లో 'షామ్ యే సూఫీయాన్'



ప్రముఖ సూఫీ గాయకులు అంజద్, అసద్ వార్సి బ్రదర్స్‌తో శంషాబాద్ విమానాశ్రయంలోని నోవాటెల్ హోటల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన 'షామ్ యే సూఫీయాన్' సంగీత విభావరి ఔరా అనిపించింది. శ్రావ్యమైన సూఫీ గాన లహరిలో సంగీత, సాహిత్య ప్రియులు ఓలలాడారు.

–శంషాబాద్